కావు. ఈ అభిప్రాయభేదాలు కాంగ్రెసును బలహీనపరచడానికే ఉపయోగపడుతున్నాయి. అందుచేత ఈ అభిప్రాయభేదాలు కొంతవరకైనా సమయింపచేయు ఉద్దేశ్యంతో మెజారిటీ వర్గాలకే కాక మైనారిటీ వర్గాలకు సైతం ప్రాతినిధ్యం ఉండే విధంగా నిర్ణయించడం అభ్యుదయ మార్గం, వివేకవంతం అనాలి. కార్యవర్గాలకే ఈ అధికారం ఉంచబడవలసిందంటూ పత్రికలలో ప్రకటించడంలో కనబడేది స్వార్థమూ, అనాలోచితమూ మాత్రమే. నాల్గుజిల్లాల కోసమే అలా రాష్ట్ర కాంగ్రెసు చేసివున్నట్టయితే మిగతా ఎనిమిది జిల్లాలలో మైనారిటీ వారికి ప్రాతినిధ్యం యివ్వవలసి వస్తుందన్న విషయం తెలియనిదా?

మరికొందరు విమర్శల్లో రాష్ట్రకాంగ్రెసు ఈ ఎన్నికల్లో పాల్గొనడం అనుచిత మన్నారు. కాంగ్రెసు పాల్గొనకపోతే జరిగే దేమంటే కాంగ్రెసు వారితో కాంగ్రెసువారు పోటీపడి ఒకరిపై నొకరు నేరారోపణలు బహిరంగంగా చేసుకోడంద్వారా సంస్థకు హానికరంగా పరిణమిస్తారు. అందుచేత ఈ పైవిమర్శ చేసేవారి వుద్దేశ్యం బహుశా ఇలా కాంగ్రెసు చేయకుండా వుంటే ఇతర పార్టీలు అధికారంలోకి రావడానికి వీలుండగలదని అయివుండాలి—పార్టీల మీద తమకుండే సానుభూతి పురస్కరించుకొని. లేదా, ఏదో 'విమర్శకోసం విమర్శ' అన్నట్టు అలా చేసివుండాలి. కాకుంటే ప్రభుత్వం ఒకవేపు ఎన్నికలు జరుపాలని ఉత్తరువులు జారీ చేసినతరువాత, రాష్ట్ర కాంగ్రెసు జిల్లాబోర్డులు రద్దుచేయమని తీర్మానం చేసి, ముక్కు మూసుకుని కూర్చుంటే జరుగబోయే దేమిటి?

ఏది ఏమైనా మొదటి విషయంలో ఆంధ్ర రాష్ట్రకాంగ్రెసు నిర్ణయం ప్రశంసార్హం ప్రజాస్వామికోచితం, నిష్పక్షపాతమైంది అన్న విషయం విజ్ఞతతో పరిశీలించే ప్రతి ఒక్కరికీ తోచకమానదు. ఇలాంటి అభ్యుదయకర నిర్ణయాలను మంతెన వెంకట్రాజు గారివంటి ఏకొద్దిమంది మాత్రమో తప్ప మరెవ్వరూ కాదనబోరని నా విశ్వాసం- కారణం, న్యాయబుద్ధీ, నిష్పాక్షికతా కోరేవా రెవ్వరూ దీన్ని ఆమోదింపకుండా వుండలేరు గనుక. గుంటూరు, పశ్చిమ గోదావరివంటి కొన్ని జిల్లా సంఘాలు, అధికారమంతా మూటగట్టి తమ చేతిలో ఉంచలేదని రాష్ట్రకాంగ్రెసు ఉత్తర్వులను నిర్లక్ష్యం చెయ్యడాన్ని సహించాలంటే రాష్ట్ర కాంగ్రెసుకు గాని, ఏ. ఐ. సి. సి. కి గాని ఏమైనా ప్రతిష్ఠ ఉండగలదేమో రాష్ట్రపతి పట్టాభి గారు మరోసారి జాగ్రత్తగా యోచించవలసి వుంది. న్యాయాన్యాయాలను ప్రజలు గుర్తించకపోరు అన్న విషయం దృష్టిలో ఉంచుకోవాలి.

# తోడు నీడ

## అంగర వెంకటకృష్ణారావు

[కాలం కట్టుబాటు లేనిది - స్థలం అనంతాకాశం-మినుకు మినుకు మెరిసే చుక్కలు స్వార్థప్రయోజకాలు మాత్రమే - గాఢాంధకారపు కడుపు చీల్చే చురకత్తివంటి కీచురాయి రవళికి వెనుక తట్టునుండి కష్టంగా కదులుతూ, పడుతూ లేస్తూ వస్తూన్న ఆకారం]

ఆకారం: కళ్లు పొడుచుకున్నా కానరావడం లేదు - ఎంతకాలమో యీ అంధకారం! ఎంత దూరమో నా గమ్యస్థానం! (పడిపోయి లేచి) హే భగవాన్! నా ముణుకులు, మోచేతులు నెత్తురు కారేలా చెక్కుకు పోయేయి- తోడైనా ఎవరూ లేరు.

(ప్రక్కనుంచి పెద్ద వికటాట్టహాసం)

ఆ: (తుళ్లిపడి) ఎవరు నువ్వు!

శబ్దం: నీ తోడు! (తిరిగినవ్వి వెనుకకు పోయి ఆగిపోయింది శబ్దం)

ఆ: (వెనుకకి చూస్తూ) నేనే శరీరం కోలుపోయి అంధకారంలో అల్లాడుతూంటే, కేవలం శబ్దం మాత్రంగావున్న యిదెవరో!

(తిరిగి వికృతహాసం) నీ నీడ!—నన్ను నువ్వింకా

పోల్చుకోలేవు - కాని నిన్ను నేను వెంబడిస్తూనే వుంటాను...ఇహి హి హి !

ఆ: అయ్యో, యిదెవరు! ఈ నా దీనపరిస్థితిలో కూడా హేళన చేస్తూంది...అబ్బబ్బ! ఏమి జీవమూతపటలి- ఏమి కీచురాయి రొద! అడుగు పడడంలేదు. హే భగవన్! 'తమసో మా జ్యోతిర్గమయ'.

శ: (పెద్ద నవ్వు...ఆ శబ్దంతో వచ్చిన అవ్యక్తవేగానికి ఆకారం తెగిన గాలిపటం వలె అల్లాడిపోతుంది) నేనే నీకు తోడునీడ- నిన్ను వెన్నాడుతూనే వున్నాను నేను.

ఆ: అయ్యో, అవ్యక్తశబ్ద దేవతా! నన్నెందుకిలా వెంటపడి వేటాడుతావు!

శ: నేను వెంటపడటం లేదు- నేనే నువ్వు! (ఆకారానికీ, శబ్దానికీ మధ్యగా క్రింద నుండి మరొక ఆకారం లేస్తుంది.)

రెండో ఆకారం: బాబూ- ఎవరండోయ్! కొంచెం ఆగండి.

మొదటి ఆకారం: నువ్వెవరు?

రెం. ఆ.: నేనొక బాటసారిని-కాదు, కాదు. బలవంతంగా ప్రయాణం కట్టబడిన గత జీవుడిని. కాని నాకు దారి తెలియడంలేదు. కొంచెం—

మొ. ఆ.: సరిపోయింది. నా దిక్కు నాకే తెలియక యీ రహో రాక్షసీవక్త్రి కుహరంలో కొట్టుకులాడుతున్నా. నీకేం దారి చూపిస్తాను!

రెం. ఆ.: అయితే నాకు దిక్కెవరు?

శ: మీ యిద్దరికీ నేనే తోడు(పెద్ద నవ్వు).

రెం. ఆ.: నన్ను వెనచుకుని విషోరగాలు తూట్లుతూట్లుగా నా శరీరంపై కాట్లు వేస్తున్నాయి—ఈ మరణలోకంలోంచి ముక్తిలేదా- హే భగవన్! 'మృత్యోర్మాఽమృతంగమయ.'

మొ. ఆ.: నేనేం పాపం చేశాను! సూక్తయుంగ సమేతంగా ద్వికాల సంధ్యావందనం చేశాను. డిప్టీ కలెక్టరునైనా నీమీద భక్తి తప్పకుండా వ్రతాలు, వుపన్యాసాలు చేసి కోవెలకి వెళ్ళడం మానకుండా, గీతాపారాయణ మరవకుండా జీవితం గడిపాను.

(మొదటి ఆకారం మాట్లాడుతూన్నంతసేపూ శబ్దం అపశ్రుతిలో మిల్లు సైరన్‌వలె ఘీంకరిస్తూంది- అతడూరుకోగానే అదీవూరుకుంది).

మొ. ఆ.: (తిరిగి) అయ్యో! చీకటి కళ్లలో సూదులవలె గుచ్చుకు పోతూంది. ఓ దేవుడా, ఈ దుర్భర తమస్సులో నీ జ్యోతిని ప్రతిష్ఠించు- నా సేవకులు - తాబేదారులు-నా పార్టీలు-అధికారం-అంతా ఎంత బూటకం!

శ: (కొద్దిగా నవ్వి వూరుకుంది - 'అయ్యో, పాపం - అయ్యో, పాపం' అనిగుక్కతిప్పకుండా పదిసార్లు అని ఆగిపోయింది.)

రెం. ఆ.: (పడిలేస్తూ) ఇదేం కర్మ దేవుడా! నేను చేసిన పుణ్య కార్యాలకి లెక్కలేదు. అన్నదానం, గోదానం, భూదానం కొల్లలుగా చేయించాను, వస్త్రదానం చేశాను.

శ: ఇహి హి హి...నీ పేరు అచ్చు వేయించావు వాటిమీద - అవి ధరించిన నిర్భాగ్య జీవులు నీ పేరు చాటడానికి.

రెం. ఆ.: మహాత్ముల జ్ఞాపక నిధులకి లక్షలిచ్చా!

శ: పరమాత్మ స్వరూపులైన పేదవారిని చరిత్ర హీనులుగా చేశావు.

రెం. ఆ: దేవాలయం కట్టించా!

శ: నిరాశ్రయుల తలలమీద నిప్పులుపోశావు.

రెం. ఆ.: వైద్యాలయం నిర్మించా!

శ: దాంట్లోకి వెళ్లేటట్లు కూడా చేశావు మానవుల్ని.

రెం. ఆ.: (ఇంకా ఏవో చెప్పబోతుంది)

శ: (వెర్రిగా ఘీంకరిస్తుంది.)

మొ. ఆ.: అయ్యో! వెలుగు, వెలుగు!!

రెం. ఆ.: అయ్యో! బాధ! అమృతం!

సుదూరోన్నత ప్రదేశంలోపది పిడుగులుపడిన ఫెళఫెళార్భటి- రెండు ఆకారాలూ వణకిపోయి అటు చూస్తాయి- కోటిసూర్యకాంతి- రెండు ఆకారాలూ ఆ ప్రభావానికి తాళలేక ఒక్కసారి కళ్లు మూసుకుని తిరిగి చూస్తాయి- ఆ వెలుగులో మరి రెండు ఆకారాలు గోచరించి మాయమౌతాయి. ఒకటి మొదటి ఆకారానికి లంచం యివ్వక, సత్యం కోసం చితికిపోయి మృత్యుదేవతకి బలి అయిపోయిన జీవాత్మ. మరొకటి, రెండో ఆకారపు ధన పిశాచానికి బలి అయిపోయిన పేదవాని జీవాత్మ.)

శ: (బిగ్గరగా) 'అసతోమా సద్గమయ'.

[తిరిగి అంధకారం- అంధకారపు కడుపు చీల్చే చురకత్తివంటి కీచురాయి రవళి]